క్లుప్తంగా

కొరియర్ వాహనం బోల్తా... డ్రైవర్‌కు గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు హైవే పోలీసులు శుక్రవారం తెలిపారు. కర్నూలు నుంచి నంద్యాలకు బయలదేరిన కొరియర్ వాహనం తమ్మరాజుపల్లె గ్రామం వద్దకు రాగానే టైర్‌పగిలి బోల్తాపడడంతో డ్రైవర్ శివకుమార్‌కు గాయాలయ్యాయి. హైవే పెట్రోల్ సిబ్బంది సంఘటన స్థలానికి చే రుకొని ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు. గాయపడిన శివకుమార్‌ను చికిత్స నిమిత్తం నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు.

సులువైన పద్ధతిలో పాఠ్యాంశాలు బోధించాలి

కల్లూరు: ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువైన పద్ధతిలో బోధించాలని ఎంఈఓలు శ్రీనివాసులు, వనజకుమారి సూచించా రు. శుక్రవారం చిన్నటేకూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులను అప్‌డెట్ చేసుకోవాలని వారు సూచించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి, అక్కడే భోజనం చేశారు. కార్యక్రమంలో ప్యానెల్ ఉపాధ్యాయులు అనురాధ, బ్రహ్మయ్య ఆచారి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘ సభ్యత్వాలకు నేడు ఆఖరు

కర్నూలు (అర్బన్): ఈనెల 29న జరగనున్న నగర బ్రాహ్మణ సంఘ ఎన్నికలకు సంబంధించి సభ్యత్వాలు నమోదు చేసుకునేందుకు ఈనెల 21వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని ఎన్నికల అధికారి కల్లె వేణుగోపాల శర్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే కర్నూలు నగర పరిధిలోని బ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో సభ్యత్వాలు స్వీకరిస్తున్నారని, ఇంకా మిగిలినవారు నేటి సాయంత్రంలోగా సభ్యత్వాలు తీసుకోవాలన్నారు. సభ్యత్వాలు తీసుకున్నవారికి గుర్తింపు కార్డులు అందించి ఓటు హక్కు కల్పిస్తామన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు.శుక్రవారం ఆ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కేవలం రోజుల్లోనే బిల్లులు కొట్టాలని అధికారులు, కాంట్రాక్టర్లు వేధిస్తుండడంతో రీడర్లు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. కాగా, రీడర్లకు ఎండీ అకౌంట్ నుంచి జీతాలు చెల్లించాలని సర్క్యులర్ ఇచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

సఫాయి కర్మచారుల జాబితా రూపొందించండి

కర్నూలు(సెంట్రల్): సర్వే నిర్వహించి సఫాయి కర్మచారుల జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రొహిబిషన్ ఆఫ్ మాన్యువల్ యాక్ట్–2013 అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మునిసిపాలిటీలు, ఆసుపత్రులు, రైల్వేలు, శానిటేషన్ జరిగే ప్రదేశాల్లో సఫాయి కర్మచారులు ఉంటారని, సర్వేచేసి జాబితాను తయారు చేయాలని సూచించారు. ఇందుకోసం డివిజినల్ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీ బి.నాగరాజు, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, జిల్లా ఎస్పీ బిందుమాధవ్,జేసీ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో చిరంజీవి,ఆర్డీఓలు ఎం.శేషిరెడ్డి, రామలక్ష్మి పాల్గొన్నారు.

మదర్సాలు ఆధునిక విద్యను అందిపుచ్చుకోవాలి

కర్నూలు సిటీ: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ముస్లిం విద్యార్థులు విద్యలో రాణించేలా, మదర్సాలు ఆధునిక విద్యను అందిపుచ్చుకుని, ఆ దిశగా విద్యాబోధన సాగించాలని షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్స్ చైర్మెన్ డా.ఖదీర్‌సాబ్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని కొత్తపేట యూసఫ్ మసీదులో ముస్లిం మత పెద్దలు, విద్యావంతులు, మేధావుల సమావేశం జరిగింది. ఇందులో పేద ముస్లింల పిల్లల విద్యాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ప్రాసిక్యూషన్, యూసూఫ్ మసీదు ముతవల్లి సయ్యద్ ఖాలీద్ మాట్లాడుతూ మదర్సాల్లో చదువుకున్న విద్యార్థులు అక్కడితో ఆగిపోకుండా ఉన్నత చదువులు చదువుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో మౌలానా హాది, మౌలాన ఖదీర్, ఖాజా ముతాహిర్, , ఇంజినీర్ జుబేర్, ప్రిన్స్, ఖాజా పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో కర్నూలుకు పతకాలు

కర్నూలు (టౌన్) : ఈనెల 14 నుంచి 16 వరకు అమలాపురంలో నిర్వహించిన 11 వ ఆంధ్రప్రదేశ్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు బాల బాలికలు పతకాలు సాధించారు. వారిని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మోసామియా, వేణుగోపాల్ శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. పతకాలు సాధించిన వారిలో బాలుర విభాగంలో లక్ష్మీనరసింహ (59 కిలోలు), ఉమా మహేశ్వరరావు (120 కిలోలు), బాలికల విభాగంలో పల్లవి (43 కిలోలు) ఉన్నారు.

చి‘వరి’ ఆయకట్టుకు బీటలు!

- సాగునీరందక అల్లాడుతున్న ఎస్సార్‌బీసీ రైతులు
- కాల్వలో రాళ్లు అడ్డుగా వేస్తుండడంతో నెలకొన్న సమస్య
- ఇరవై రోజులుగా చుక్కనీరందక ఎండుతున్న వరిపైరు


రైతులతో కాల్వలో రాళ్లు తీయిస్తున్న ఎస్సార్‌బీసీ అధికారులు


ఎండిపోయిన వరిపైరు


కొణిదేడు గ్రామం వద్ద కాల్వలకు అడ్డుగా వేసిన రాళ్లు

పాణ్యం: ఎస్సార్‌బీసీ చివరి ఆయకట్టుకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. అధికారులు నిర్లక్ష్యం వలన వరిపైరు బీటలుబారుతుంది. ప్రస్తుతం సమృద్ధిగా వర్షాలు కురిసినా సాగునీటికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎస్సార్‌బీసీ కాల్వల్లో ఎక్కబడితే అక్కడ రాళ్లు పెట్టి దిగువకు నీళ్లు వెళ్లుండా చేస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసకోవడం లేదని చివరి ఆయకుట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ నుంచి బ్లాక్–4 పరిధిలో కొణిదేడు, ఆలమూరు, గోనవరం, భూపనపాడు, మద్దూరు ఉన్నాయి. ఈ బ్లాక్ కింద 8873 ఆయకట్టు ఉంది. చివరి ఆయకట్టు అయిన ఆలమూరు, గోనవరం పొలాలకు సాగునీరు సక్రమంగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

వంద ఎకరాలకు అందని సాగునీరు

బ్లాక్–4 కింద గోనవరం, ఆలమూరు రైతులు ఖరీఫ్‌లో వరి పంటను విస్తారంగా సాగు చేశారు. ఈ రెండు గ్రామాలకు సంబంధించి దాదాపు 80 ఎకరాలకుగా ఇరవై రోజుల నుంచి సాగు నీరు అందడం లేదు. దీంతో వరిమళ్లు ఎండిబీటలుబారాయి. సమస్య తెలిసినా సబంధింత అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించలేకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే శుక్రవారం కాల్వ వెంట పర్యటించిన సంబంధిత అధికారులు కాల్వలో అడ్డుగా వేసిన రాళ్లను రైతులతో తీయించారు. అధికారులు స్పందించి చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలని కోరుతున్నారు.

కాల్వలో రాళ్లు అడ్డువేయడంతో నెలకొన్న సమస్య

ఎస్సార్‌బీసీ బ్లాక్–4 పరిధిలోని కొణిదేడు గ్రామం పొలాల కంటే కాల్వ నాలుగు అడుగుల తగ్గులో ఉంటుంది. దీంతో ఆ గ్రామ ఆయకట్టు తమ పొలాలకు నీరు మళ్లించేందుకు కాల్వలో భారీ రాళ్లు, కర్రలు అడ్డువేసి సాగునీటిని మళ్లించుకుంటారు. దీంతో దిగువకు సాగునీరు సాఫీగా వెళ్లడం లేదు. గోనవరం, ఆలమూరు రైతులకు సాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. కాల్వలో అడ్డుగా వేసిన రాళ్లను గోనవరం, ఆలమూరు రైతులు తొలగించినా మళ్లీ రాళ్లు ప్రత్యక్షం అవుతున్నాయి. ఆ రైతులు అలా వెళ్లగానే మళ్లీ పైపొలాల రైతులు రాళ్ల అడ్డుగా వేస్తున్నారని చివరి ఆయకట్టు రైతులు వాపోతున్నారు. కొందరు రైతులు కలిసి గస్తీ తిరుగాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి నిబంధనల మేరకు సాగునీరు అందించాలని చివరి ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

పంట ఎండిపోతుంది



ఖరీఫ్‌లో ఐదు ఎకరాల్లో వరి సాగు చేశా. వరి నాటినప్పటి నుంచి సమృద్ధిగా సాగునీరు అందడం లేదు. నీళ్ల కోసం రాత్రిబవళ్లు కాల్వలపై తిరుగుతున్నాం. పైపొలాల రైతులు కిందకు నీరు వెళ్లకుండా కాల్వలో రాళ్లు వేస్తున్నారు. తాము గుర్తించి తీసేసినా మళ్లీ అదేతంతు. చాలా ఇబ్బందిగా ఉంది. దీంతో నీరురాక పంటలు ఎండిపోతున్నాయి. అధికారులు స్పందించి చివరి ఆయకట్టుకు సాగునీరు వచ్చేలా ఆచూడాలి.

– మౌల రైతు గోనరం

సాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం



ఇరవై రోజులుగా వరిమడికి సాగునీరు అందడం లేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. మాతో పాటు చాలా మంది రైతులు వరి పొలాలు ఎండిపోతున్నాయి. వేలకువేలకు పెట్టుబడి పెట్టి కూడా ప్రయోజనం లేకుండా పోతుతంది. సాగునీటి కోసం ప్రతిరోజు యుద్ధం చేయాల్సి వస్తోంది. చివరి ఆయకట్టులో మా పొలాలు ఉండడంతో మరీ సమస్య ఎక్కువగా ఉంది. సాగునీరు ఎప్పుడు వస్తాయే తెలియడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రైతు మద్దిలేటిస్వామి, గోనవరం

చివరి ఆయకట్టుకు సాగునీరు

బ్లాక్–4 పరిధిలో సాగునీటి సమస్యను మా సిబ్బంది గుర్తించారు. ప్రతి రోజు కాల్వల పర్యవేక్షణకు వెళ్తున్నారు. కాల్వలో రాళ్లు లేకుండా తీయిస్తున్నారు. ఏ రైతులకు సాగునీటి సమస్య రానివ్వం. ప్రారంభం నుంచి చివరి ఆయకట్టు వరకు సిబ్బంది పరిశీలించి నీటి ప్రవాహంలో ఇబ్బంది లేకుండా చూస్తున్నారు. సమస్య పరిష్కార చర్యలు తీసుకోవాలని మరోసారి సిబ్బందికి సూచిస్తాం.

– కృష్ణన్న, ఈఈ కడ విభాగం

రుణాలను రీషెడ్యూల్ చేయించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

సి.బెళగల్: పొదుపు మహిళలు బ్యాంక్‌ల ద్వారా పొందిన రుణాలను సకాలంలో చెల్లించి రీషెడ్యూల్ చేయించుకోవాలని మండల మహిళా సంఘం (ఎంఎంఎస్) అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో ఆమె మండలంలోని గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులు, సభ్యులు, వీఓఏలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్త్రీ నిధి, బ్యాంక్ లింకేజీ రుణాల మంజూరు, వినియోగం, చెల్లింపులపై ఆమె సభ్యులకు వివరించారు. ఏపీఎం వెంకటస్వామి మాట్లాడుతూ, రుణాలను రెగ్యులర్‌గా చెల్లించిన గ్రూపులకు ఎక్కువ మొత్తంలో రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయన్నారు. సమావేశంలో సీసీలు గుండమయ్య, రాముడు, అకౌంటెంట్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతను పాటించాలి

సి.బెళగల్: ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని సి.బెళగల్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బలరాముడు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో కర్నూల్ మెడికవర్ హాస్పిటల్ ప్రతినిధులు నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం డాక్టర్లు విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించి అవసరం మేరకు మందులను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ విజేయుడు, అధ్యాపకుడు చింతలయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో చక్కటి ఆరోగ్యం


ఇంటి ఎదుట తొట్టిని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి నూకరాజు

కోడుమూరు రూరల్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా చక్కటి ఆరోగ్యాన్ని పొందవచ్చునని జిల్లా మలేరియా అధికారి నూకరాజు సూచించారు. శుక్రవారం కోడుమూరులో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న ఫ్రైడే..డ్రైడే కార్యక్రమాన్న ఆయన తనిఖీ చేశారు. నూకరాజు మాట్లాడుతూ దోమల మూలంగా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మలేరియా తదితర ప్రమాదకర జ్వరాలు, వ్యాధులు సోకుతాయన్నారు. ప్రజలు ఇంటి ముంగిట ఖాళీ తొట్లలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. ఎవ్వరికైనా జ్వరం లక్షణాలు ఉంటే వెంటనే వారి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు జరిపి అవసరమైన మందులను అందజేయాలని వైద్య సిబ్బందిని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో కోలోకెటెడ్ పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్స్ కమాల్‌సాహెబ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన

కల్లూరు: పరిసరాల పరిశుభ్రతపై ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చిన్నటేకూరు శాఖ బ్రాంచ్ మేనేజర్ ఎం.ప్రసాద్ గ్రామంలోని వేంకటేశ్వర హైస్కూల్‌లో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాఘవేంద్రరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ

గడివేముల: విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసం పొందుతారని ఎంఈఓ విమలా వసుంధరా దేవి తెలిపారు. గడివేముల జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండల స్థాయిలో రాణించిన క్రీడాకరులు నియోజకవర్గ స్థాయిలో పాల్గొంటారని చెప్పారు. కబడ్డీ, ఖోఖో, టెన్నిస్, వాలీ బాల్ క్రీడా పోటీలు జరిగాయన్నారు. కార్యక్రమంలో పీఈటీలు భుజంగరావు, కవిత, హెచ్ఎం విక్టర్ ఇమ్మానుయేలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ కోత

కర్నూలు న్యూసిటీ : నగరంలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ కోతలు విధించనున్నట్లు ఆ శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు శేషాద్రినాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణేష్ నగర్, రామచంద్రమిషన్ ఏరియా, రెవెన్యూ కాలనీ, సోమిశెట్టినగర్, మదర్‌ల్యాండ్, సాయివైభవ్ కాలనీ, జంపాల అపార్టుమెంట్, నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీల్లో విద్యుత్ కోతలు ఉంటాయని, ఆయా ప్రాంతాల ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


పొదుపు కార్యాలయంలో మొక్కలు నాటుతున్న డీపీఓ మంజులవాణి, ఎంపీపీ ఉసేన్‌బీ

పాణ్యం: ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటాలని, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని డీపీఓ మంజులవాణి, ఎంపీపీ ఉసేన్‌బీ పిలుపునిచ్చారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాణ్యం పొదుపు కార్యాలయంలో వారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద, ఇతర ప్రదేశాల్లో తప్పకుండా మొక్కలు నాటాలన్నారు. అదేవిధంగా నాటిన మొక్కలను బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పర్యావరణం దెబ్బతింటుందని, భవిష్యత్తు తరాలకు ఆరోగ్యాన్ని అందించేందుకు మొక్కలను విరివిగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం స్వచ్ఛతాహి సేవపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగసుంకమ్మ, ఏపీఎం ప్రసాద్, ఈఓర్డీ సులోచన, ఈఓ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.


సి.బెళగల్ మోడల్ స్కూల్లో మొక్కలు నాటుతున్న అధికారులు


కె.నాగలాపురంలో మొక్క నాటి నీరును పోస్తున్న సబిహ పర్వీన్

మొక్కలు పెంచడం సామాజిక బాధ్యత


దొడ్డిపాడు పాఠశాలలో మొక్కలు నాటుతున్న దృశ్యం

సి.బెళగల్: మొక్కలు పెంచడం సామాజిక బాధ్యత అని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. శుక్రవారం స్థానిక మోడల్ స్కూల్లో ఎస్ఎంసీ చైర్మన్ తిప్పన్న, ప్రిన్సిపాల్ వంశీమోహన్, సర్పంచ్ పాండురంగన్న, ఉపాధ్యాయులతో కలిసి ఈఓఆర్డీ మొక్కలు నాటారు. అదేవిధంగా మోడల్ బాలికల హాస్టల్ పరిసరాలలో ఉపాధ్యాయినులు రాధా, ఉషారాణితో అధికారులు మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ లక్ష్మన్న, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఎఫ్ఏ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: పర్యావరణ పరిక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఉపాధ్యాయురాలు ప్రశాంతి తెలిపారు. మండల పరిధిలోని దొడ్డిపాడు గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో అమ్మపేరుతో శుక్రవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మహబూబ్ బాషా, మిన్నెల, ఖాసిం బాషా, రఫీ, గరీబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి బాధ్యతగా సంరక్షించుకోవాలని గూడూరు మండల స్పెషలాఫీసర్ సబిహ పర్వీన్ సూచించారు. శుక్రవారం గూడూరు మండలంలోని కె.నాగలాపురం గ్రామంలో స్పెషలాఫీసర్ సబిహ పర్వీన్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న స్వచ్ఛతా హీసేవ కార్యక్రమాన్ని ఆమెను పరిశీలించి అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధన చేయాలి


ప్రాథమిక పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ వసంతలక్ష్మి

కోడుమూరు రూరల్: ప్రతి విద్యార్థికి అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు చదువు చెప్పాలని ఎంఈఓ వసంతలక్ష్మి సూచించారు. శుక్రవారం కోడుమూరులోని సంతపేట ప్రాథమిక పాఠశాల, ఉర్దూ పాఠశాలలను ఎంఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆయా పాఠశాలల రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు బోధన తీరును పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో వెనుకబడి ఉంటే వారికి ప్రత్యేకంగా బోధించాలన్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ పరిశీలించారు. మెనూ ప్రకారం ప్రతి రోజు నాణ్యమైన భోజనం పెట్టేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులేదనని ఎంఈఓ తెలిపారు.

ఈ కేవైసీని పూర్తి చేయించుకోవాలి


రైతుతో ఈ కేవైసీ చేయిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: మండలంలో పంటలు సాగుచేసి, ఈ పంట నమోదు చేసుకున్న రైతులు తప్పనిసరిగా ఈ కేవైసీని చేయించుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక మండల వ్యవసాయ కార్యాలయానికి వచ్చిన రైతులతో ఈ కేవైసీని చేయించారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది చేపట్టిన ఈ కేవైసీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఈ కేవైసీ నమోదుకు ఈ నెల 23వ తేదీ వరకు సమయం ఉందన్నారు. అదే విధంగా గొల్లలదొడ్డి గ్రామంలో పర్యటించి సజ్జ, కంది పంటలను పరిశీలించారు. సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో వీఏఏ శశికాంత్, ఎంపీఈఓలు వెంకటేష్, సునంద తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను విరమించుకోవాలి


నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్) : టీడీపీ ప్రభుత్వం వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు అబ్దుల్లా, నగేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సుందరయ్య సర్కిల్‌లో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే కుట్ర చేస్తోందన్నారు. ఎన్ఎంసీ అనుమతులు ఇచ్చిన కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించలేమని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడం సిగ్గు చేటన్నారు. సీఎం చంద్రబాబునాయుడు వైద్య కళాశాలలను గుజరాత్ తరహాలో పబ్లిక్, ప్రైవేట్, పార్ట్‌నర్‌షిప్ విధానంలో నిర్మించాలని చూడటం దారుణమన్నారు. భవిష్యత్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను తొలగించేందుకు కుట్ర జరుగుతోందన్నారు. రాష్ట్రంలో ఉన్న 37 మెడికల్ కళాశాలల్లో 6 మాత్రమే ప్రభుత్వం ఆధీనంలో ఉన్నాయని, మిగిలిన వాటిని ప్రైవేట్ పరం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. తక్షణమే ప్రైవేట్ పరం చేసేందుకు విడుదల చేసిన జీఓలు 107,108లను రద్దు చేయాలన్నారు. లేదంటే విద్యార్థి లోకం రోడ్లపైకి రావాల్సి వస్తుందని హెచ్చరించారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు


చెస్ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు

ఓర్వకల్లు: స్కూల్ గేమ్స్ ఫెడరేష్ ఆధ్వర్యంలో కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు శుక్రవారం ముగిశాయి. అండర్–14, అండర్–17 విభాగాలలో బాలబాలికలకు నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలలో విజేతల వివరాలను ఎంఈఓ ఓంకార్ యాదవ్ వెల్లడించారు. అండర్–17 బాలుర విభాగం కబడ్డీ పోటీలలో కాల్వబుగ్గ గురుకుల పాఠశాల జట్టు ప్రథమ స్థానం, సోమయాజులపల్లె జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయన్నారు. చెస్ పోటీలలో అండర్–14 బాలుర విభాగంలో ఏపీ ఎంఎస్ ఓర్వకల్లు ప్రథమ స్థానం, మీదివేములకు ద్వితీయ స్థానం లభించినట్లు తెలిపారు. అలాగే అండర్–17 బాలుర విభాగంలో కాల్వబుగ్గ గురుకులానికి ప్రథమ స్థానం, ఓర్వకల్లు బాలభారతి పాఠశాలకు ద్వితీయ స్థానం లభించినట్లు ఆయన తెలిపారు.

పచ్చదనం చాటున ప్రమాదం!



గడివేముల మండల పరిధిలోని బిలకలగూడూరు రహదారిలోని బాలాజీ టెంపుల్ సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభానికి పచ్చటి చెట్ల తీగలు అల్లుకున్నాయి. వర్షాకాలం కావడంతో పచ్చటి తీగలకు విద్యుత్ సరఫరా అయితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందలాది మంది ఆలయానికి రావడం తోపాటు జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీకి కార్మికులు వెళ్తుంటారు. ప్రమాదం జరగకముందే విద్యుత్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– గడివేముల

మారని బోర్డు...


కర్నూలు జిల్లా అని ఉన్న తహసీల్దార్ కార్యాలయం బోర్డు

గడివేముల: కొత్త జిల్లాలు ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా గడివేముల తహసీల్దార్ కార్యాలయం వద్ద బోర్డులో ఇప్పటికీ కర్నూలు జిల్లా ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. నంద్యాల జిల్లాలో గడివేముల ఉంది. ఇప్పటికే నలుగురు తహసీల్దారు మారినా బోర్డును మాత్రం మార్చలేకపోయారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాతబడిన బోర్డే దర్శనమిస్తుండడంతో అటుగా వెళ్తున్న బాటసారులు బోర్డు మార్పించడానికి కూడా రెవెన్యూ అధికారులకు తీరిక లేదా అంటూ నిట్టూర్చుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కర్నూలు జిల్లా అని కొత్తబోర్డును ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.